సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం, 26, ఆగస్టు, 2023



'అంగన్‌వాడీ'కి కలెక్టర్!

కలెక్టర్ ప్రియాంక తన కుమార్తె, కుమారుడితో కలిసి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి అక్కడి పిల్లలతో కాసేపు గడిపారు. 8లో



నెరవేరుతున్న ఏళ్ల కల

ఇల్లెందులో బస్‌డిపోను ఈనెల 28న ప్రారంభిస్తుండడంతో స్థానికుల ఏళ్ల నాటి కల నెరవేరినట్లవుతుంది. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మ వారికి అభిషేకం జరిపిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కుంకుమార్చన, వరలక్ష్మీ వ్రతం నిర్వహించాక అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. ఆతర్వాత ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే, అమ్మవారిని ఒడిశా ఎమ్మెల్యే ముఖేష్ మహలింగం, టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ దంపతులు దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మహిపతి రామలింగంతో పాటు అర్చకులు, సభ్యులు పాల్గొన్నారు. కాగా, ఆలయంలో ఈనెల 31న చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. పాల్గొనాలనుకునే భక్తులు రూ.2,516 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని ఈఓ సూచించారు.

డీడబ్ల్యూఓగా స్వర్ణలత లెనీనా



కలెక్టర్ ప్రియాంకకు పుష్పగుచ్ఛం ఇస్తున్న స్వర్ణలత

కొత్తగూడెంటౌన్: జిల్లా సంక్షేమ శాఖ అధికారి (డీడబ్ల్యూఓ)గా స్వర్ణలత లెనీనా నియమితులయ్యారు. ఇక్కడ డీడబ్ల్యూఓగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.సబితను ఉన్నతాధికారులు శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్‌కు తాజాగా సరెండ్ చేశారు. దీంతో ఐసీడీఎస్ సీడీపీఓగా కొనసాగుతున్న లెనీనాకు డీడబ్ల్యూఓ బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు ఆమె శుక్రవారం కలెక్టర్ ప్రియాంకను మర్యాదపూర్వకంగా కలిశారు.

మహ్మద్‌నగర్‌లో మెగా వైద్యశిబిరం

పరిశీలించిన డీఎంహెచ్‌ఓ శిరీష



జ్వరపీడితులను పరీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ, వైద్యులు

చండ్రుగొండ: మండలంలోని మహ్మద్‌నగర్‌లో శుక్రవారం మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో విషజ్వరాలు ప్రబలిన నేపథ్యాన శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరపీడితులకు వైద్యసేవలు అందించారు. ఈమేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్.శిరీష గ్రామాన్ని సందర్శించి వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా స్థానికులు జాగ్రత్త వహించేలా అవగాహన కల్పించాలని ఉద్యోగులకు సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, జిల్లా సర్వేలెన్స్ అధికారి పర్షియానాయక్, డీపీహెచ్‌ఎన్ అన్నమేరి, వైద్యులు ఇమ్మానియల్, వెంకట్‌ప్రకాష్, కుమారస్వామి, కనకం తనూజతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

విదేశీ విద్యా పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

సూపర్‌బజార్(కొత్తగూడెం): విదేశాల్లో చదువుకోవాలనే మైనార్టీ(ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు) విద్యార్థులు ఆర్థికసాయం కోసం ముఖ్యమంత్రి విదేశీ విద్యాపథకం(సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఓ ప్రకటనలో సూచించారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్, వైద్యవిద్య పీజీ కోర్సుల్లో విదేశాల్లోని యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందిన వారు వచ్చేనెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. www. telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని, ప్రతులను జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. ఈ పథకానికి ఎంపికైన విద్యార్థులకు ఫీజు నిమిత్తం రూ.20లక్షలతో పాటు ప్రయాణ ఖర్చులకు రూ.60 వేలు మంజూరవుతాయని కలెక్టర్ వెల్లడించారు.

ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?!

విప్ కాంతారావు







ఎమ్మెల్యే హరిప్రియ

రాష్ట్రంలో పలు రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు

- ఇల్లెందు, మణుగూరు డివిజన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూపులు
- మరో మూడు మండలాల కోసం కూడా...
- రెండేళ్లుగా మూలుగుతున్న ప్రతిపాదనలు
- విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యే హరిప్రియపైనే భారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు చేయాలనే డిమాండ్లపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటోంది. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, మెదక్ జిల్లాలోని రామాయంపేట కేంద్రాలుగా కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు గురువారం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. అంతకు ముందుకు ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో కొత్త మండలాల ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే అభ్యర్థుల జాబితాను అధికార బీఆర్‌ఎస్ పార్టీ ప్రకటించింది. దీంతో ఆయా జిల్లాలు, నియోజకవర్గాల వారీగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను చకచకా పరిష్కరిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విషయానికి వస్తే ఇల్లెందు, మణుగూరు కేంద్రాలుగా కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు కోసం రెండేళ్ల కిందట ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. అయినా ఇప్పటివరకు స్పందన రాలేదు.

తప్పనిసరిగా కావాల్సిందే..

భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలో భద్రాచలం, పినపాక నియోజకవర్గాలు ఉన్నాయి. గోదావరి నదికి ఇరువైపులా ఉన్న మండలాలు ప్రస్తుతం భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి వస్తాయి. దీంతో గోదావరికి ఎడమ వైపు ఉన్న ప్రాంతం భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలోనే ఉంచి.. కుడి వైపు ప్రాంతాలను కలుపుకుని మణుగూరు కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని అక్కడి ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అంతే కాకుండా జనాభా ఎక్కువగా ఉన్న కొత్తగూడెం డివిజన్‌ను విభజించి ఇల్లెందుకు కొత్తగా రెవెన్యూ డివిజన్ హోదా ఇవ్వాలనే డిమాండ్ ఉంది.

సులభంగా వేగంగా

జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువ. ఇదే సమయంలో జిల్లా అంతటా పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. వీటికి తోడు సీతారామ వంటి బహుళార్థ సాధక సాగునీటి ప్రాజెక్టు నిర్మాణంలో ఉంది. వందల ఏళ్ల నుంచి సింగరేణి సంస్థ జిల్లాలో బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. ఇటీవల జాతీయ రహదారులు జిల్లాకు మంజూరయ్యాయి. దీంతో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం తరచుగా భూసేకరణ చేయాల్సిన అవసరం ఏర్పడుతోంది. కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటైతే పరిపాలన మరింత వేగంగా, సులభంగా అందించే వీలు కలుగుతుంది.

దృష్టి సారిస్తే...

ఎన్నికలు సమీపిస్తున్న వేళ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ఎమ్మెల్యేలు దృష్టి సారించారు. దీంతో చెక్కుల పంపిణీ, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు విరివిగా చేస్తున్నారు. ఇదే క్రమంలో ఇల్లెందు, పినపాక ఎమ్మెల్యేలు బానోతు హరిప్రియ, రేగా కాంతారావు కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుపై దృష్టి సారించాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్న నేపథ్యాన ప్రభుత్వ పెద్దలను ఒప్పించగలిగితే ఫలితం ఉంటుందని చెబుతున్నారు.

కొత్త మండలాలు

కొత్త మండలాల విషయానికి వస్తే ఇల్లెందు మండల పరిధిలో ఉన్న కొమురారం, టేకులపల్లి మండల పరిధిలోని బోడు, అశ్వాపురం మండల పరిధిలోని మొండికుంట కేంద్రంగా కొత్త మండలాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందాయి. ఈమేరకు మండలాలను ఎలా విభజించాలనే అంశంపై ప్రాథమిక నివేదికలు సైతం సిద్ధమయ్యాయి. కానీ కాగితాలను దాటి కార్యరూపం దాల్చడం లేదు. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లకు సంబంధించి జనాభా తక్కువగా ఉందని, సరిపడా సంఖ్యలో ఎంపీటీసీ స్థానాలు లేకపోవడం వల్ల కొత్త మండలాల ఏర్పాటు సాధ్యం కావడం లేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

దూరభారం తప్పించేలా...

రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే విస్తీర్ణం పరంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ద్వితీయ స్థానంలో ఉంది. పైగా జిల్లాలో అడవులు ఎక్కువగా విస్తరించి ఉన్నాయి. గిరిజన జనాభా అత్యధికం. ఐదు అసెంబ్లీ స్థానాలు ఉంటే నాలుగు గిరిజనులకే రిజర్వ్‌డ్‌గా ఉన్నాయి. దీంతో రెవెన్యూ డివిజన్ కేంద్రాలకు రావాలంటే కొన్ని మండలాల ప్రజలకు దూరాభారం అవుతోంది. ఈనేపథ్యాన అడవులు, కొండప్రాంతాలు, గిరిజన జనాభా ఎక్కువగా నివసించే చోట జనాభాతో సంబంధం లేకుండా కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలు ఏర్పాటు చేసే వెలుసుబాటు ఉంది. అప్పుడే పరిపాలన మరింత చేరువ చేయవచ్చు. ఈ అంశాన్ని ప్రస్తుత సమయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగలిగితే జిల్లాలో కొత్త డివిజన్లు, మండలాల ఏర్పాటు సులభమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'హస్త'వాసి దక్కేదెవరికో?!

- కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తుల వెల్లువ
- అత్యధికంగా ఇల్లెందు నుంచి 38 మంది
- కొత్తగూడెం, అశ్వారావుపేట నుంచి ఏడుగురు
- పినపాకకు సైతం పోటెత్తిన దరఖాస్తులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ కొత్తగా ప్రవేశపెట్టిన విధానానికి ఊహించిన దానికంటే ఎక్కువ స్పందనే వచ్చింది. జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల నుంచి హస్తం గుర్తుపై పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న నేతలు తమ దరఖాస్తులను గాంధీభవన్‌లో సమర్పించారు. దరఖాస్తుకు శుక్రవారం చివరి రోజు కావడం, శ్రావణ శుక్రవారం కలిసి రావడంతో దరఖాస్తులు పోటెత్తాయి. శుక్రవారం సాయంత్రం వరకు గాంధీభవన్ నుంచి అందిన సమాచారం ప్రకారం ఇల్లెందు నియోజకవర్గం నుంచి అత్యధికంగా 38 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత పినపాక నియోజకవర్గం నుంచి 15 మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. అశ్వారావుపేట, కొత్తగూడెం నుంచి ఏడుగురు చొప్పున దరఖాస్తులు సమర్పించారు. ఇక కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్న భద్రాచలం నుంచి రెండు దరఖాస్తులే వచ్చినట్టు తెలుస్తోంది. దరఖాస్తులను వడపోసి, క్షేత్రస్థాయిలో చేపట్టిన సర్వే నివేదికల ఆధారంగా టికెట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ నాయకత్వం చెబుతోంది. దీంతో దరఖాస్తుదారుల్లో ఎవరికి టికెట్ వస్తుందనేది తెలియాలంటే ఇంకొన్నాళ్లు ఆగాలిందే! కాగా, గాంధీభవన్ వర్గాల ద్వారా అందిన సమాచారం ఆధారంగా నియోజకవర్గాల వారీగా దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరి వివరాలిలా ఉన్నాయి.

కొత్తగూడెం : పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎడవల్లి కృష్ణ, ఊకంటి గోపాల్‌రావు, నాగ సీతారాములు, పోట్ల నాగేశ్వరరావు, లక్కినేని సురేందర్, దేవీప్రసన్న

అశ్వారావుపేట : తాటి వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, సున్నం నాగమణి, ధంజూనాయక్, వగ్గెల పూజ, దారబోయిన రమేశ్, కట్రం నరసింహారావు

పినపాక : పాయం వెంకటేశ్వర్లు, బట్టా విజయ్‌గాంధీ, పోలేబోయిన శ్రీవాణి, డాక్టర్ శంకర్‌నాయక్, కొమరం కాంతారావు, చందా సంతోష్, ధనసరి సూర్య, ఊకే ముద్దరాజు, తోలెం నాగేశ్వరరావు, గొంది వెంకటేశ్వర్లు, కాటిబోయిన నాగేశ్వరరావు, కొర్సా ఆనంద్, కణితి కృష్ణ

ఇల్లెందు : కోరం కనకయ్య, చీమల వెంకటేశ్వర్లు, లక్ష్మణ్ నాయక్, సంజయ్ నాయక్, మంగీలాల్ నాయక్, రామ్‌చందర్‌నాయక్, డాక్టర్ జి.రవి, భూక్యాదళ్‌సింగ్ నాయక్, వెంకటప్రవీణ్, నాగమణి, వెంకట్‌లాల్, మోకాళ్ల శ్రీనివాసరావు, పోరిక సాయిశంకర్‌నాయక్, డీఎస్.రావు, విజయాబాయి, బానోతు విజయలక్ష్మి, కల్తీ వెంకట్, బాలాజీరావు నాయక్.

వైద్యరంగంలో పేరు సాధించాలి...

- కలెక్టర్ ప్రియాంక అల
- ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తనిఖీ



మెడికల్ కళాశాల విద్యార్థులతో కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెంఅర్బన్: వైద్యవిద్యలోప్రతిభ కనబరిచి వైద్యరంగంలోనూ పేరు సాధించడం ద్వారా జిల్లాకు, రాష్ట్రానికి ఖ్యాతి తీసుకురావాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల వైద్య విద్యార్థులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలను శుక్రవారం తనిఖీ చేసిన ఆమె విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే వైద్యవిద్యను ఎంచుకోవడంపై అభినందించారు. కళాశాల పచ్చని చెట్లుతో ఆహ్లాదకరంగా ఉండేందుకు గాను విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ కళాశాలలో 150 సీట్లకు గాను 149 మంది చేరారని తెలిపారు. అనంతరం వైద్య కళాశాల నిర్మాణ పనులపై కలెక్టర్ ఆర్ అండ్ బీ ఈఈ టీంలాతో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.అనిల్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మోకాళ్ల వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బీ డీఈ మురళి, తహసీల్దార్ నాగరాజు పాల్గొన్నారు.

ఓటును పరిశీలించుకోవాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రతీఒక్కరు తమ ఓటు వివరాలను జాబితాలో పరిశీలించుకోవాలని కలెక్టర్ ప్రియాంక సూచించారు. జిల్లాలోని 1,095 పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారం ఉద్యోగులు అందుబాటులో ఉంటారని, జాబితా సరిచూసుకుని చేర్పులు, మార్పులపై దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అంతేకాకుండా కొత్త ఓటర్లు కూడా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈవిషయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

దళితబంధు దరఖాస్తుల విచారణ

దళితబంధు పథకం కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారులను కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె అధికారులతో సమావేశమై మాట్లాడారు. దళితబంధు రెండో విడతలో నియోజకవర్గానికి 1,100 యూనిట్లు మంజూరు చేయగా, ఇప్పటి వరకు 3,310 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటిని క్షేత్రస్థాయిలో విచారించి లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని చెప్పారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు, అధికారులు అర్జున్, జీనుగు మరియన్న, ఎస్.వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, సీతారాం, డాక్టర్ పురంధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'నిధి ఆప్‌కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న 'నిధి ఆప్ కే నిఖత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీంఖాన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌ఓ) ఆధ్వర్యాన జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని సమస్యలు వెల్లడించవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వాసులు కల్లూరులోని లార్జ్‌సైజ్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో, భద్రాద్రి జిల్లావాసులు ఇల్లెందు మున్సిపల్ ఆఫీస్ వద్ద జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని ఆయనసూచించారు.

చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంరూరల్: తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ పీపీపీ పద్ధతిలో చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని సంస్థ జిల్లా మేనేజర్ జి.మహిందర్‌రెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు 15 స్థలాలను గుర్తించగా, ఎంపికైన ఆపరేటర్లకు పదేళ్ల వరకు స్థలాన్ని కేటాయిస్తారని పేర్కొన్నారు. ఆ స్థలంలో సొంత ఖర్చుతో చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేసుకొని నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సంస్థ వైబ్‌సైట్‌లో కానీ తమ కార్యాలయంలో కానీ సంప్రదించాలని సూచించారు.

చల్లంగా చూడు తల్లీ...



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

రామాలయంలో ఘనంగా వరలక్ష్మి వ్రత పూజలు

భద్రాచలం: పిల్లాపాపలను చల్లంగా చూడు తల్లీ అంటూ మహిళలు శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారిని వేడుకున్నారు. భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి ప్రత్యేక స్నపనం, పంచామృతాలతో అభిషేకం జరిపారు. అలాగే, సాయంత్రం బేడా మండపంలో పల్లకీసేవగా స్వామి వారి ఉత్సవ మూర్తులు, అమ్మవారి ప్రతిమను తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. అర్చకులు సామూహిక కుంకుమార్చన నిర్వహించగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు.

స్వర్ణకవచధారణలో రామయ్య

అంతరాలయంలో మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ తదితర పూజలు నిర్వహించిన అర్చకులు, బేడా మండపంలో కొలువుదీరిన స్వామికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. అలాగే, స్వామికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.స్వీకరించారు.

పచ్చదనం పరిఢవిల్లేలా...

- నేడు జిల్లాలో 'కోటి వృక్షార్చన'
- 4.85లక్షల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు
- జిల్లావ్యాప్తంగా 948 ప్రదేశాల గుర్తింపు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు



మొక్కలు నాటేందుకు గుంతలు తీయిస్తున్న పంచాయతీ ఉద్యోగులు

చుంచుపల్లి: తెలంగాణ ఏర్పడ్డాక హరితహారం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ కోట్లాది మొక్కలను నాటిస్తోంది. ఇప్పటివరకు తొమ్మిది విడతలుగా జిల్లాలో చేపట్టిన హరితహారంతో సత్ఫలితాలు వచ్చాయి. జిల్లాలో ఏకంగా 18,136 హెక్టార్ల పరిధిలో 11 కోట్లకు పైగా మొక్కలను నాటారు. ప్రతిసారి హరితహారంలో భాగంగా గ్రామాలు, మున్సిపాలిటీలకు లక్ష్యాలను కేటాయించి విరివిగా మొక్కలను నాటించడమే కాక సంరక్షిస్తోంది. హరితహారానికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం అప్పుడప్పుడు కోటి వృక్షోత్సవం, కోటి వృక్షార్చన కార్యక్రమాలను చేపడుతూ ఒకేరోజు లక్షల కొద్దీ మొక్కలను నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా చేపడుతుండడంతో అటవీ విస్తీర్ణంలో పేరున్న జిల్లా మరింత పచ్చదనాన్ని సంతరించుకుంటోంది. ఈ ఏడాది కూడా భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం కోటి వృక్షార్చనకు సిద్ధమైంది. ఈ మేరకు జిల్లాలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేయగా.. కావాల్సిన మొక్కలను నర్సరీల్లో అందుబాటులో ఉంచారు. వీటిని నాటేందుకు ప్రదేశాలను గుర్తించి గుంతలు సైతం సిద్ధం చేశారు.


టార్గెట్ 4.85 లక్షలు మొక్కలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో భారీ ఎత్తున మొక్కలు నాటాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే అటవీశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న 527 నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశారు. ఇవే కాకుండా అవెన్యూ ప్లాంటేషన్‌లో పెద్ద మొక్కలు నాటేందుకు ఇతర ప్రాంతాల నుంచి సైతం తెప్పించారు. కోటి వృక్షార్చనలో అవెన్యూ ప్లాంటేషన్‌తో పాటు ప్రభుత్వ స్థలాలు, అటవీ ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటనున్నారు. ఇందుకోసం అటవీ శాఖ ఆధ్వర్యాన 948 ప్రదేశాలను గుర్తించి, 20 రకాల పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలను నాటేలా సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 4.85 లక్షల మొక్కలు నాటాలనేది లక్ష్యం కాగా, ఒక్కో జీపీకి వెయ్యి చొప్పున, నాలుగు మున్సిపాలిటీలకు మరో చొప్పున లక్ష్యం కేటాయించారు. పండుగ వాతావరణంలో కోటి వృక్షార్చన చేపట్టాలని కలెక్టర్ ప్రియాంక అల ఇప్పటికే అధికారులకు దిశానిర్దేశం చేశారు. కాగా, శనివారం కలెక్టర్ ప్రియాంక కొత్తగూడెం రామచంద్ర ఆర్ట్స్,సైన్స్ ప్రభుత్వ కళాశాలలో జిల్లా అధికారులతో కలిసి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

గత తొమ్మిది విడతల హరితహారంలో నాటిన మొక్కలు (లక్షల్లో)

విడత	లక్ష్యం	నాటినవి
మొదటి	116.93	116.49
రెండు	154.12	161.33
మూడు	160.00	163.09
నాలుగు	95.00	96.17
ఐదు	154.62	146.27
ఆరు	118.14	160.29
ఏడు	104.97	135.41
ఎనిమిది	95.00	105.08
తొమ్మిది	65.40	55.13

వృక్షార్చనకు ఏర్పాట్లు పూర్తి



భారత వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లాలో కోటి వృక్షార్చన కార్యక్రమాన్ని చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే కావాల్సిన మొక్కలను అందుబాటులో ఉంచాం. ప్రతీ పంచాయతీలో వెయ్యి మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని నిర్దేశించాం. వృక్షార్చనలో భాగంగా మొక్కలు నాటడమే కాక సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటాం.

– జి.మధుసూదన్‌రాజు, అదనపు కలెక్టర్

క్లుప్తంగా

టమాటా కిలో రూ.30!

● వ్యాపారుల పోటీతో దిగొచ్చిన ధర

సుజాతనగర్: నిన్నామొన్నటి వరకు రూ.60 పలికిన కేజీ టమాటా ధర ఒక్కసారిగా రూ.30కి పడిపోయింది. గొల్లగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యాపారి కొన్నిరోజుల నుంచి సుజాతనగర్‌లోని ఏపీజీవీబీ ఎదురుగా కూరగాయలను విక్రయిస్తున్నాడు. ఆయన కిలో టమాట రూ.30 చొప్పునే అమ్ముతుండడం, మిగతా వారు రూ.60కి విక్రయిస్తుండటంతో ప్రజలంతా సదరు వ్యాపారి వద్ద బారులు దీరుతున్నారు. దీంతో వ్యాపారులంతా శుక్రవారం ఆయనను కలిసి ధర పెంచాలని సూచించగా తక్కువ ధరకు వస్తుండడంతో అలాగే అమ్ముతున్నానని ఆయన చెప్పగా.. కొందరు వినియోగదారులు కూడా ఆ వ్యాపారికి మద్దతుగా నిలిచారు. దీంతో వ్యాపారులు చేసేదేం లేక కిలో టమాట రూ.30, రెండు కిలోలు రూ.50 చొప్పున విక్రయించడం మొదలుపెట్టారు.

గంజాయి స్వాధీనం



నిందితుడితో ఎక్సైజ్ శాఖ అధికారులు

భద్రాచలం: భద్రాచలం మీదుగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో పాటు హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ ఉద్యోగులు శుక్రవారం భద్రాచలంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వరంగల్‌కు చెందిన వనం సాయి అనుమానాస్పదంగా కనిపించడంతో ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా ఐదు కేజీల గంజాయి లభ్యమైంది. ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసిన ఆయన వరంగల్‌కు చిన్న ప్యాకెట్లుగా మార్చి అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో సీఐలు లతీఫ్, సర్వేశ్వర్, నాగేశ్వరరావు, రహీమున్నీసా, ఎస్‌ఐలు అనిల్, మురళి, గౌతమ్, మురళీకృష్ణ, రతన్ ప్రసాద్, సిబ్బంది కరీం, రామకృష్ణ, హబీబ్, అలీం, సుధీర్, హన్మంతరావు, వెంకట్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

పామాయిల్ గెలల చోరీ

దమ్మపేట: పామాయిల్ గెలలు చోరీకి గురైన ఘటన మండలంలోని అర్బన్‌కాలనీ శివారులో గల వ్యవసాయ క్షేత్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. దమ్మపేటకు చెందిన బాధిత రైతు అంగోతు నాగప్రసాద్ కథనం ప్రకారం.. నాగప్రసాద్.. అర్బన్‌కాలనీ శివారులోని తన పామాయిల్ క్షేత్రంలో సుమారు ఐదు టన్నుల పామాయిల్ గెలలను నరికించాడు. గెలల కోత పూర్తయ్యేసరికి చీకటి పడగా, వాటిని తోటలోనే ఉంచి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం తోటలోకి వెళ్లి చూడగా గెలలు కనపడకపోవడంతో, చోరీకి గురయ్యాయని భావించాడు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నానని నాగప్రసాద్ తెలిపారు.

బంగారు గొలుసు..

దుమ్ముగూడెం: మండలంలోని లచ్చిగూడెం గ్రామంలోని పాయం బాబూరావుకు చెందిన రూ.1.40 లక్షల విలువ గల బంగారు గొలుసు గుర్తుతెలియని దుండగులు గురువారం చోరీ చేశారు. ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేనిసమయంలో బాబూరావు ఇంటికి ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు వచ్చారు. పక్కింటి వారు పిలుస్తున్నా ఆగకుండా వెళ్లిపోయారు. బాబూరావు ఇంటికి తిరిగి వచ్చాక చూస్తే గొలుసు కనిపించలేదు. శుక్రవారం బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

టేకు చెక్కల పట్టివేత

చర్ల: మండలంలోని కుర్నపల్లి నుంచి చింతగుప్ప మీదుగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న టేకు చెక్కలను శుక్రవారం మధ్యాహ్నం చర్ల ఫారెస్ట్ రేంజ్ అధికారులు పట్టుకున్నారు. చర్ల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అచ్యా కథనం ప్రకారం.. కుర్నపల్లి నుంచి కలప రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు చర్ల రేంజ్ సిబ్బంది చింతగుప్ప సమీపంలోని అటవీ ప్రాంతంలో నిఘా ఉంచారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం వస్తున్న ఒక ట్రాక్టర్‌ను ఆపి అందులో తనిఖీ చేయగా సైజులుగా కోసి ఉన్న 53 టేకు చెక్కలు కనిపించాయి. ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్‌ను విడిచిపెట్టి అక్కడి నుంచి పారిపోగా ట్రాక్టర్‌ను చర్ల రేంజ్ కార్యాలయానికి తరలించి సీజ్ చేశామని, పట్టుబడిన కలప విలువ రూ.73,957 అని అచ్యా తెలిపారు.

రేషన్ బియ్యం..

జూలూరుపాడు: అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా శుక్రవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. జూలూరుపాడు ఎస్‌ఐ పురుషోత్తం సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పాపకొల్లు క్రాస్‌రోడ్ వద్ద అనుమానస్పదంగా వెళ్తున్న ఆటోను చూశారు. పోలీసులను గమనించి ఆటోను వెనక్కి తిప్పుకొని ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా ఎస్‌ఐ పురుషోత్తం, సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. ఆటోలో 6 క్వింటాళ్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని అన్నారుపాడు గ్రామానికి చెందిన వాంకుడోత్ వెంకన్న, కొమ్మినేని నాగేశ్వరరావుగా గుర్తించి వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

పాల్వంచ: ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారుడ్రైవర్‌పై కేసు నమోదైంది. పది రోజుల కిందట ప్రియదర్శిని కాలనీ సమీపంలో సున్నా బాబు తన ద్విచక్రవాహనంపై వెళ్తూ యూటర్న్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో వరంగల్‌కు చెందిన స్వామి కారులో వెళ్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బాబు కాలుకు బలమైన గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం బాబు కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాము కేసు నమోదు చేశారు.

నెరవేరుతున్న ఏళ్ల కల

● ఈ నెల 28న ఇల్లెందులో బస్ డిపో ప్రారంభం
● హాజరుకానున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
● ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే హరిప్రియ



డిపో ప్రారంభోత్సవ ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, అధికారులు

ఇల్లెందు: ఆరు దశాబ్దాల కల నెరవేరబోతోంది. ఈ నెల 28న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఇల్లెందు శాటిలైట్ బస్ డిపోను ప్రారంభించనున్నారు. ఒకనాడు కనీస రవాణా సదుపాయాలు లేని ఇల్లెందు నియోజకవర్గ కేంద్రంలో నేడు ఇల్లెందు పేరుతో బస్సులు తిరిగే దశకు చేరింది. ఈ బస్‌డిపోతో రాష్ట్రంలో ఇల్లెందుకు ఓ గుర్తింపు సంతరించుకోబోతోంది. శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ ఆర్టీసీ అధికారులతో కలిసి బస్‌డిపోను సందర్శించి పరిశీలించారు. ఈ నెల 28న మధ్యాహ్నం 2 గంటల తర్వాత బస్ డిపో ప్రారంభోత్సవం జరగనున్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఇల్లెందు బస్ డిపో ఏర్పాటు కోసం ఆహర్నిశలు అధికారులు, మంత్రులతో చర్చించానని తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్ సహకారంతో బస్‌డిపోను మంజూరు చేశారని, వేగంగా నిర్మాణం పూర్తి చేసినప్పటికీ బస్టాండ్ నుంచి బస్ డిపోలో ప్లాట్‌ఫాం సీసీ నిర్మాణం చేయాల్సి ఉందని, ఇందుకు రూ.1.40 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. అటు ప్రారంభోత్సవం ఇటు సీసీ ప్లాట్ ఫాం నిర్మాణంకు శంకుస్థాపన జరుగుతుంని పేర్కొన్నారు. ఇక నుంచి ఇల్లెందు నుంచి చుట్టు పక్కల గ్రామాలకు బస్‌రూట్లు పెరుగుతాయని, అదే క్రమంలో సుదూర ప్రాంతాలకు బస్సులు వెళ్లే అవకాశం కూడా ఉందని వెల్లడించారు. ఇల్లెందు బస్‌డిపోను ఇక్కడి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

బస్సుల కేటాయింపు..

కొత్తగూడెం డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇల్లెందు డిపోకు 24 బస్సులు కేటాయించామని తెలిపారు. కొత్తగూడెం నుంచి 14, ఖమ్మం నుంచి 10 బస్సులు కేటాయించినట్లు చెప్పారు. డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది, ఇతర అధికారులతో కలిపి 100 మంది వరకు పనిచేసే అవకాశం ఉందన్నారు. పెట్రోల్ బంక్ కూడా త్వరలో వస్తుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, కమిషనర్ కుమారస్వామి, మేనేజర్ అంకుషావలీ, ఆర్టీసీ, పీఆర్ అధికారులు భాస్కర్, అంజయ్య, సాగర్, దామోదర్‌రెడ్డి, నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇల్లెందు ఆర్టీసీ డిపోను ఖమ్మం ఆర్‌ఎం వెంకన్న కూడా పరిశీలించి ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ఆరా తీశారు.

పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించాలి

అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

అశ్వారావుపేటరూరల్: సెక్టార్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను తరచూ పర్యవేక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి పర్సా రాంబాబు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో, ఆ తర్వాత ఎంపీడీఓ కార్యాలయంలో సెక్టార్ అధికారులు, బీఎల్‌ఓలతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. పార్టీ నాయకుల సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల బూత్ లెవెల్ అధికారులతో సమన్వయం చేసుకొని పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని సూచించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలు, సమస్యలపై నివేదిక సమర్పించాలని తెలిపారు. ఓటర్ల జాబితా తయారీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్‌ఓలు శని, ఆదివారం అందుబాటులో ఉండి కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం వచ్చే దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించారు. సమావేశాల్లో స్థానిక తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసరావుతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

వాగు దాటి వైద్యం

కాలినడకన వెళ్లిన వైద్యాధికారి, ఉద్యోగులు



గ్రామానికి వెళ్లేందుకు వాగు దాటుతున్న వైద్యాధికారి, ఉద్యోగులు

కరకగూడెం: మండలంలోని కరకగూడెం – చిరుమళ్ల మధ్య బ్రిడ్జి ఇటీవల భారీ వర్షాల కారణంగా కోతకు గురైంది. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. ఈ క్రమంలో శుక్రవారం పీహెచ్‌సీ వైద్యాధికారి కారం మధు ఉద్యోగులతో కలిసి వాగు దాటి కాలినడకన వెళ్లి చిరుమళ్ల ఆశ్రమ పాఠశాల, పాలకమ్మతోగు, రాయనపేట గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. అలాగే, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కాగా, రహదారి సౌకర్యం లేకపోయినా పదిరోజుల వ్యవధిలో రెండు సార్లు వైద్యశిబిరం ఏర్పాటు చేసిన వైద్యాధికారి, ఉద్యోగులకు స్థానికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాయం నర్సింహారావు, ఏఎన్‌ఎం పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్



ఏపీఓకు మందు వేస్తున్న హోమియో వైద్యులు

భద్రాచలం: మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యాన సీజనల్ వ్యాధులే కాకుండా కళ్లకలక ప్రబలుతోందని.. ఉద్యోగులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో హోమియోపతి వైద్యులు వెంకటేశ్వర్లు ఏపీఓతో పాటు అధికారులకు కళ్ల కలక నివారణ మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ.. ఉద్యోగులు జాగ్రత్తగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పులు, దుమ్ము, ధూళి ప్రభావంతో కళ్లకలక వస్తుందని, సరైన చికిత్స తీసుకుంటే ఇబ్బంది ఉండదని చెప్పారు. కాగా, రానివారు సైతం ముందు జాగ్రత్తగా మందులు వాడొచ్చని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు భీం, మునీర్‌పాషా, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమా.. ప్రభుత్వ స్థలమా.. తేల్చండి



గిరిజనులతో మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్‌ఓ ద్వాలియా



వాగ్వాదానికి దిగిన గిరిజనులు, అటవీ అధికారులు

అశ్వాపురం: మండలంలోని జగ్గారం రెవెన్యూ పరిధి 400, 400/2 సర్వే నంబర్లలో ఉన్న భూమిని సర్వే చేసి అటవీ శాఖ భూమినా? ప్రభుత్వ భూమినా? అనే విషయాన్ని తేల్చాలని స్థానిక గిరిజనులు డిమాండ్ చేశారు. ఆయా సర్వే నంబర్లలోని భూమిని ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేయాలని కొన్నేళ్లుగా ఆందోళనలు చేస్తున్నారు. శుక్రవారం గిరిజనులు పెద్ద సంఖ్యలో పోడు సాగుకు సిద్ధం కాగా, సమాచారం అందుకున్న ఎఫ్‌ఆర్‌ఓ ద్వాలియా, బీట్ ఆఫీసర్లు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. ఘటనపై ఎఫ్‌ఆర్‌ఓ ద్వాలియా ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని చర్చించారు. ఎఫ్‌ఆర్‌ఓ ద్వాలియాను వివరణగా కోరగా అటవీ భూమిలో గిరిజనులు పోడు నరుకుతుండగా అడ్డుకుని 50 మందిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇదే విషయమై గిరిజనులు మాట్లాడుతూ.. భూమి సర్వే చేయించాలని, అటవీ భూమిగా నిర్ధారణ అయితే తాము సాగు చేయమని చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సర్వే చేయకపోతే సాగు చేయాల్సి వస్తుందని తెలిపారు.

వాగొడ్డుగూడెంలో పోడు వివాదం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వాగొడ్డుగూడెం గ్రామ శివారులో గల భూమిలో శుక్రవారం గిరిజనులకు, అటవీ శాఖ సిబ్బందికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. సుమారు 90 హెక్టార్ల భూమి విషయంలో పోడుసాగుదారులకు, అటవీ అధికారులకు మధ్య ఏటా వాగ్వాదం జరుగుతూనే ఉంది. తాజాగా అటవీశాఖ సిబ్బంది ఈ భూముల్లో కంప విత్తనాలు చల్లుతున్నారు. విషయం తెలుసుకున్న గిరిజనులు అక్కడికి చేరుకొని అటవీశాఖ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. గిరిజనులు మాట్లాడుతూ.. పోడు భూముల్లో అటవీ అధికారులు దౌర్జన్యంగా విత్తనాలు చల్లిస్తున్నారని, ఈ భూములను తామే ఏళ్లుగా సాగు చేస్తున్నామని వాపోయారు. దీనిపై స్థానిక ఫారెస్ట్ ఇన్‌చార్జ్ రేంజర్ కరుణాకరచారి మాట్లాడుతూ.. అటవీశాఖకు చెందిన ప్లాంటేషన్ భూములేనని, ఈ భూముల్లో గిరిజనులకు పోడు పట్టాలు కూడా రాలేదన్నారు. ప్లాంటేషన్ పనులను అడ్డుకుంటున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

ఇల్లెందురూరల్: ఐటీఐలో ఫెయిల్ అయినందుకు మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన జోగ శ్రావణ్ (18) మహబూబాబాద్‌లో ఐటీఐ చదువుతున్నాడు. ఐటీఐలో ఫెయిల్ కావటంతో మనస్తాపం చెందాడు. ఒడ్డుగూడెం సమీపంలోని నీటి కుంటలో పడి మృతి చెందాడు. నాలుగేళ్ల కిందట శ్రావణ్ తండ్రి మృతి చెందాడు. నాటి నుంచి తల్లి పూర్ణిమ శ్రావణ్, తమ్ముడు యశ్వంత్‌ను కూలీ నాలీ చేసి చదివిస్తోంది. తండ్రి మృతి చెందిన తర్వాత వారు స్వగ్రామం లచ్చగూడెం నుంచి ఒడ్డుగూడెం చేరి రెక్కల కష్టం మీద ఆధారపడి జీవిస్తున్నారు.

వ్యక్తిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు

పాల్వంచ: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పాండురంగాపురం తండాకు చెందిన తామరబోయిన లింగస్వామి శుక్రవారం పట్టణంలోని రాజీవ్‌గాంధీ సెంటర్‌లో ఉండగా బెల్లం మహేశ్వరి, ఆమె సోదరుడు నగేశ్ పాత కక్షల విషయంలో అక్కడ గొడవపడి తలపై కర్రతో కొట్టడంతో తల పగిలింది. ప్రభుత్వ ఆస్పత్రిలో లింగస్వామి చికిత్స పొంది పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

గైర్హాజరు కార్మికులకు 28న కౌన్సెలింగ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు ఈనెల 28న కౌన్సెలింగ్ ఏర్పాటుచేసినట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు తెలిపారు. రుద్రంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు కుటుంబంతో హాజరుకావాలని సూచించారు. ఈఏడాది జనవరి 1నుండి జూలై 31వరకు 50 కంటే తక్కువ మస్టర్లు ఉన్న ఉద్యోగులు కౌన్సెలింగ్‌కు రావాలని ఆయన తెలిపారు. విధినిర్వహణలో ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలను వివరిస్తే పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి

నివాళులర్పించిన జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య



సుమన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య తదితరులు

ఇల్లెందురూరల్: ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో గాయపడిన మండలంలోని సుదిమళ్ల గ్రామానికి చెందిన రైతు చింత సుమన్ (36) మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సుమన్ తనకున్న కొద్దిపాటి చేనులో పత్తి పంట సాగు చేస్తున్నాడు. జీవనోపాధి కోసం ట్రాక్టర్ డ్రైవర్‌గా కూడా పనిచేస్తుంటాడు. శుక్రవారం ట్రాక్టర్ యజమాని అనుమతితో తన సొంత పొలంలో మధ్యాహ్నం వరకు దున్నడం పూర్తి చేశాడు. ఇంటికి బయలు దేరి పొలం గట్లలో ట్రాక్టర్ నడుపుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టింది. ట్రాక్టర్ కింద పడిపోయిన సుమన్‌ను సమీపంలోని రైతులు గుర్తించి బయటకు తీసి, ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స ప్రారంభించేలోగానే సుమన్ మృతిచెందాడు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, సుదిమళ్ల సర్పంచ్ కల్తీ పద్మ, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కుమార్తెలు మేఘన, చర్రి ఉన్నారు.

గాయపడిన యువకుడు మృతి



మధుసూదన్‌రెడ్డి మృతదేహం

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామశివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు దారం మధుసూదన్‌రెడ్డి (21) శుక్రవారం మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య రెండుకు చేరింది. మృతదేహాన్ని భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించగా పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అందించారు. ఎస్‌ఐ కేశవరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలంరోడ్డు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం–1పై గుర్తు తెలియని వ్యక్తి (55) శుక్రవారం మృతి చెందాడు. అనారోగ్య సమస్యతో మరణించాడని భావిస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపుకార్డులు లేవని, మృతుడు బ్లూ రంగు ఫుల్ షర్ట్.. దానిపై అడ్డం తెల్లని గీతల డిజైన్ ఉందని, గోధుమ రంగు లుంగీ, ఎరుపు రంగు టవల్ ధరించి ఉన్నాడని వివరించారు. మృతుడి కుడి చెయ్యికి స్టీల్ కడియం, రెండు చేతుల చివరి, ఉంగరం వేళ్లకు పంచ లోహం ఉంగరాలున్నాయని ఎస్‌ఐ శ్రీకాంత్ చెప్పారు. మృతుడు యాచకుడి వలె ఉన్నాడని, మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చామని, వివరాలు తెలిసినవారు 99890 25481, 87126 58600 నంబర్లలో సంప్రదించాలని ఎస్‌ఐ వివరించారు.

అంగన్‌వాడీ సెంటర్‌కు కలెక్టర్!

పిల్లలతో సహా వచ్చినప్రియాంక



కుమార్తెకు బొమ్మలు చూపిస్తున్న కలెక్టర్



కలెక్టర్ కుమారుడితో అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది

కొత్తగూడెంటౌన్: కలెక్టర్ ప్రియాంక అలా తన కుమార్తె మైరా, కుమారుడు కియాన్‌తో శుక్రవారం కొత్తగూడెం 27వ వార్డు గాజుల రాజం బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చారు. సాధారణ తల్లి మాదిరిగానే పిల్లలను తీసుకొచ్చిన ఆమె అంగన్‌వాడీ టీచర్లను పరిచయం చేసుకుని పిల్లలతో కాసేపు అక్కడే గడిపారు. అందరితో పాటు నేలపై కూర్చుని పిల్లలను ఆడిస్తూ టీచర్ చెప్పిన పాఠాలను వినిపించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనీనా, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, శైలజ, ప్రసన్నతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షా సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్, పక్కన నాయకులు

చుంచుపల్లి: ఖమ్మంలో ఆదివారం జరగనున్న బహిరంగ సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పాల్గొంటారని, ఈ సభకు జిల్లా నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమిత్‌షా ఆదివారం మధ్యాహ్నం భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకుని ఖమ్మం సభకు హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గానికి 10 వేల మంది చొప్పున కార్యకర్తలను తరలించేలా ఏర్పాట్లు చేశామని, నాయకులు గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. కాగా, తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణకు ఒరిగిందేమీ లేదని శ్రీశైలం ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలతో పాటు రైతాంగాన్ని మోసం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, కేవీ రంగాకిరణ్, ప్రభాకర్ రెడ్డి, ఎడ్లపల్లి శ్రీనివాస్‌కుమార్, ఆకుల నాగేశ్వరరావుగౌడ్, రాయుడు నాగేశ్వరరావు, లక్ష్మణ్ అగర్వాల్, పైడిపాటి రవీందర్, పాలిశెట్టి వెంకటేశ్వర్లు, గాంధీ, సాయిరాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 1న ధర్నాకు తరలిరావాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి



మాట్లాడుతున్న నాగిరెడ్డి

భద్రాచలంఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యారంగం, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అందరూ నిరసించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ బాధ్యుడు, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. పీఆర్‌సీ కమిటీని నియమించడంతో పాటు ఐఆర్ ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేయడమే కాక విద్యారంగంలో కాంట్రాక్ట్ వ్యవస్థను తొలగించాలనే తదితర డిమాండ్లతో సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మునిగడప రామాచారి, కిశోర్, వేణు, రాజు, మురళీమోహన్, పాపారావు, జయబాబు తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



పుట్టిన బాబుతో నందిని, 108 సిబ్బంది..

ములకలపల్లి: 108 వాహనంలో మహిళ పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని మామిళ్లగూడెం గ్రామానికి చెందిన చెంచు నందిని పురుటినొప్పులతో బాధపడుతున్నట్లు 108 ఫోన్‌కాల్ వచ్చింది. వెంటనే 108 స్టాఫ్ ఈఎంటీ ఎం.అజయ్, పైలట్ గోలి వెంకటేశ్వర్లు హుటాహుటిన మామిళ్లగూడెం వెళ్లి నందినిని ములకలపల్లి పీహెచ్‌సీకి తరలిస్తున్నారు. మార్గమధ్యలో నందినికి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో వాహనాన్ని నిలిపివేసి, చికిత్స అందించడంతో బాబు జన్మించాడు. తల్లీబిడ్డా ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. ప్రాథమిక వైద్యం నిమిత్తం స్థానిక మంగపేట పీహెచ్‌సీకి తరలించారు.